గణనాథుల ప్రతిమలకు ఫుల్ డిమాండ్

- పోటీపడి విగ్రహాల తయారీ
- ఇప్పటి నుంచే ఆర్డర్లు

పొదలకూరు/ తోటపల్లిగూడూరు : వినాయకుని విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. తయారీదారులు పోటీపడి బొమ్మలను తయారు చేస్తున్నారు. పొదలకూరు పట్టణంలో దశాబ్ద కాలంగా ఇతర రాష్ట్రాల వారు విగ్రహాలను తయారు చేస్తూ జీవనోపాధిగా మార్చుకున్నారు. సెప్టెంబరులో వినాయక చవితి ఉండడం వల్ల ఇప్పటి నుంచే గ్రామీణ ప్రాంతాల నుంచి యువకులు వచ్చి బొమ్మలను పరిశీలిస్తున్నారు. అంతేకాక ముందుగానే గ్రామీణ ప్రాంతాల వారు బొమ్మలను ఎంపిక చేసుకుని అడ్వాన్సులు ఇచ్చి వెళ్తున్నారు. గ్రామగ్రామాన విఘ్నేశ్వరుని విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నందున బొమ్మలకు డిమాండ్ బాగా ఉంది. అయితే రాజస్తాన్ ప్రాంతం నుంచి పొదలకూరుకు వచ్చిన బొమ్మల తయారీదారుల వల్ల వ్యాపారంలో పోటీ పెరిగింది. ఫలితంగా భక్తులకు బొమ్మల ధరలు అందుబాటులో లేవంటున్నారు. ఆరు మాసాల పాటు తయారీదారులు కష్టించి పనిచేస్తే వినాయక చవితికి గ్రామాల్లో భక్తులకు బొమ్మలను అందించగలరు. కొందరు ఉత్సవ కమిటీ సభ్యులు పండగ రెండు, మూడు మాసాలు ముందుగానే తమకు కావలసిన బొమ్మ డిజైన్ను అందజేస్తే తయారీదారులు తమ నైపుణ్యంతో విగ్రహాన్ని అందించే వెసులుబాటు ఉంది. అయితే పట్టణంలోని పద్మావతినగర్‌లో సృజనాత్మకతతో ప్రతిఏటా వివిధ రకాల ఆకృతులతో గణనాథుని ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఎలుక వాహనంపైనే కాక రకరకాల పక్షులు, జంతువులను కూడా విఘ్నేశ్వరుని వాహనంగా ఉపయోగిస్తున్నట్టుగా బొమ్మలను రూపొందిస్తున్నారు. పెరిగిన ప్లాస్టాఫ్ ప్యారీస్, సున్నం, ఇతర ముడి పదార్థాలు, రంగులు వేసేందుకు అందించే కాంట్రాక్టు తదితర లెక్కలు చూసుకుని బొమ్మల ధరలను పెంచినట్టుగా తయారీదారులు వెల్లడించారు.

నరుకూరు కేంద్రంగా బొమ్మల తయారీ

నరుకూరు కేంద్రంగా వినాయక విగ్రహాల తయారీ ఊపందుకొంది. నరుకూరు సెంటర్‌లో ప్రస్తుతం రెండు విగ్రహాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఈ ఏడాది దాదాపు 800 నుంచి 1000కి పైగా వినాయకుని బొమ్మలు రూపుదిద్దుకొంటున్నాయి. ఆయా కేంద్రాల్లో రెండు నుంచి 15 అడుగుల ఎత్తైన బొమ్మలను తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్సవాల నిర్వాహకులు ఇప్పటికే వినాయక విగ్రహాలకు ఆర్డర్లు మొదలెట్టారు. బొమ్మల డిమాండ్‌ను బట్టి మరిన్ని ప్రతిమలను తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. విభిన్న రీతిలో, రంగురంగుల బొమ్మలు రూపుదిద్దుకొంటున్నాయి. ఇక్కడి విగ్రహాలకు మంచి గుర్తింపు ఉండడంతో జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల నుంచి ఉత్సవాల నిర్వాహకులు ఇక్కడి విగ్రహాలను కొనుగోలు చేసే పనిలో పడ్డారు.

అమాంతం పెరిగిన ధరలు

వినాయక బొమ్మల తయారీకి సంబంధించిన ముడిసరుకుల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో బొమ్మల ధరలు ఈ దఫా ఆకాశాన్నంటే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రూ.4 వేలు పలికిన రెండు అడుగుల బొమ్మ ఈసారి రూ.6 వేలకు చేరింది. గతంలో రూ.8 వేలకు అందిన నాలుగు అడుగుల బొమ్మ ప్రస్తుతం రూ.15 వేలకు చేరింది. అదేలా గతంలో రూ.18 వేలు పలికిన ఎనిమిది అడుగుల బొమ్మ నేడు రూ.22 వేలు నుంచి రూ.25 వేలు పలుకుతోంది. అయినప్పటికీ బొమ్మలను కొనుగోలు చేసేందుకు ఉత్సవ నిర్వాహకులు అడ్వాన్సులు కడుతున్నారు. దీంతో బొమ్మల తయారీ కేంద్రాల్లో పండగ వాతావరణం నెలకొంది.



నరుకూరు తయారీ కేంద్రంలో ఉత్సవాలకు సిద్ధమైన బొజ్జగణపయ్యలు



పొదలకూరులో గణనాథుని బొమ్మకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు



నరుకూరులో విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

ముడి సరుకుల ధరలు పెరిగాయి



గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వినాయక విగ్రహాలకు డిమాండ్ పెరిగిపోయింది. అయితే బొమ్మల తయారీకి ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో తయారీ ఖర్చులు అధికమయ్యాయి. దీనివల్లే బొమ్మల ధరలను కూడా పెంచక తప్పడం లేదు. అయినా కొనుగోలు బాగానే జరుగుతుండడం ఆనందదాయకం.

– విజయ్‌కుమార్,
విగ్రహాల తయారీదారుడు, నరుకూరు

క్లుప్తంగా

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- డీఏఓ సత్యవాణి



తాటిపర్తిలో వరిపైరును పరిశీలిస్తున్న డీఏఓ

పొదలకూరు : రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సత్యవాణి సూచించారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో వరిపైర్లను ఆమె గురువారం క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం సచివాలయంలో కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడి పాటించాల్సిందిగా సూచించారు. ఎడగారులో వరి దిగుబడి తగ్గుతుందన్నారు. మండలంలో 700 ఎకరాల్లో ఎడగారు సాగు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారన్నారు. వరిపైరులో మైట్స్ నివారణకు వేపనూనె 1500 పీపీఎంను లీటరు నీటికి 5 ఎంఎల్ వంతున పిచికారీ చేయాల్సిందిగా సూచించారు. స్పైరో మెసిఫిన్ 0.5 ఎంఎల్‌ను లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవచ్చని వెల్లడించారు. పీఎంఈజీపీ పథకం ద్వారా నిరుద్యోగ యువత, స్వయం సహాయ సంఘాలకు చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పుకునేందుకు అవకాశం ఉందన్నారు. వ్యవసాయ డ్రోన్లను సబ్సిడీ ద్వారా పొందేందుకు రూ.50 లక్షల వరకు రుణాలు అందజేస్తారన్నారు. సమావేశంలో డీఏఓ కార్యాలయ ఏడీఏ నర్సోజీరావు, పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ఎ.వాసు, ఏఈఓ ఏడుకొండలు నాయక్, వీఏఏ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

దాడులను సహించం



మాట్లాడుతున్న మీజూరు మల్లి

మనుబోలు : జర్నలిస్టులపై దాడులను సహించబోమని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ యాక్షన్ కమిటీ డివిజన్ అధ్యక్షుడు మీజూరు మల్లి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జేఏసీ కమిటీ నాయకుడు బాబు మోహన్‌దాస్ అధ్యక్షతన కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు నచ్చని వార్తలు ప్రచురించారని రాజకీయ నాయకులు, ఇతరలు వేధిస్తే ఊరుకోబోమన్నారు. దాడులను ఐక్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కాకాణి పరామర్శ



పట్టాభిరామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాకాణి

మనుబోలు : మండలంలోని జట్లకొండూరులో మాజీ సర్పంచ్ పల్లంరెడ్డి పట్టాభిరామిరెడ్డి ఇటీవల మరణించగా వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పట్టాభిరామిరెడ్డి ఉత్తర క్రియలకు హాజరైన కాకాణి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు యరమాపు శరత్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో ఉండడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కాకాణి వెంట పార్టీ నాయకులు మన్నెమాల సుధీర్‌రెడ్డి, ఆవుల తులసీరాం, గుమ్మడి వెంకటసుబ్బయ్య, పల్లంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి బస్సు సర్వీస్

పొదలకూరు : పొదలకూరు నుంచి తిరుపతికి కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసును గురువారం ప్రారంభించారు. పొదలకూరులో ప్రతిరోజు ఉదయం 8 గంటలకు తిరుపతికి బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. గతంలో ఇదే బస్సు సర్వీసును అధికారులు నడిపినా కలెక్షన్ సక్రమంగా రావడం లేదని నిలిపివేశారు. దీంతో స్థానికులు కొందరు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడంతో రాపూరు డిపో మేనేజర్‌తో సంప్రదించి బస్సును పునరుద్ధరించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ



ముత్తుకూరులో నోటిఫికేషన్ అంటించిన సిబ్బంది



కొడవలూరు : నార్తురాజుపాలెం హైస్కూల్లో నోటిఫికేషన్ వేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ముత్తుకూరు : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీన జరిగే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా పాఠశాలల నోటీసు బోర్డులో నోటిఫికేషన్‌తో పాటు ఓటర్ల జాబితా కూడా అంటించారు. ఈనెల 5వ తేదీన దీనిపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఎన్నికల నిర్వహణకు తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 8వ తేదీన ఎన్నికయ్యే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. తరువాత మొదటి ఎస్ఎంసీ సమావేశం నిర్వహిస్తారు.

- కొడవలూరు : ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వాహక కమిటీల ఎంపికకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వాహక కమిటీ ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్ల జాబితాను ప్రకటించి మాట్లాడారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎంపిక చేసి వారి ద్వారా పాఠశాలల నిర్వాహక కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటామన్నారు. ఈనెల 8వ తేదీన ఎన్నిక ప్రక్రియ జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల అభివృద్ధికి దోహదపడే వారిని ఎన్నుకోవాలని కోరారు. ఆమె వెంట హైస్కూల్ హెచ్ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లీన్ కోవూరు లక్ష్యంగా అడుగులు

కోవూరు : క్లీన్ కోవూరు లక్ష్యంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండల కేంద్రంలో ఉన్న బాపన కాలువలో పూడిక తీత పనులను ఆమె గురువారం ప్రారంభించారు. క్లీన్ కోవూరు దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాలను ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనంపై అసహనం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

వెంకటాచలం సీఐగా సుబ్బారావు

వెంకటాచలం : వెంకటాచలం సీఐగా సుబ్బారావును నియమించారు. ఇక్కడ సీఐగా ఉన్న అంకమరావును గత నెల 28వ తేదీన వీఆర్‌కు పంపారు. సీఐల బదిలీ ప్రక్రియలో భాగంగా సుబ్బారావును వెంకటాచలానికి నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈయన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటికే వైద్యసేవలు



కొడవలూరు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఇంటి వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారి ఎం.రామకృష్ణ అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆలూరుపాడులో గురువారం వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఇద్దరు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్య సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రాథమిక స్థాయిలోనే వ్యాధులను గుర్తించి పరిష్కరించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్ఎం నదియ, ఆశా కార్యకర్త పద్మజ పాల్గొన్నారు.

కామాక్షమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కామాక్షమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆషాడమాస సారెను గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సారె సమర్పణ వేడుకలు మూడురోజుల పాటు జరుగుతాయని, వచ్చే ఏడాది నెలరోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, నాయకులు హరికృష్ణ, ఎంవీ శేషయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.



కామాక్షమ్మకు సారె తీసుకెళ్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

కొడవలూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అందులో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తా చెదారాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అపరిశుభ్రత నెలకొంటే ఈగలు ఎక్కువై డయేరియా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మలేరియా, డెంగీ లాంటి ప్రమాదకర వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతి పంచాయతీలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పైప్‌లైన్ మరమ్మతులు, ఇతరత్రా ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా ట్యాంక్‌లలో బ్లీచింగ్ విధిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాత, వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఓ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ఏపీఎం రుక్మిణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

విడవలూరు ఎస్సైగా సాయిప్రసాద్

విడవలూరు : విడవలూరు నూతన ఎస్సైగా సాయిప్రసాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధ్యలు స్వీకరించారు. ఆత్మకూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై రాజా ప్రస్తుతం మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన సాయిప్రసాద్

పింఛన్ల పంపిణీ పక్కాగా జరగాలి



ఇందుకూరుపేట : పింఛన్ల పంపిణీ గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ ఆనంద్



కొడవలూరు : నార్తురాజుపాళెంలో పింఛన్ అందజేస్తున్న పీడీ సాంబశివారెడ్డి

- కలెక్టర్ ఆనంద్

ఇందుకూరుపేట : గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ పక్కాగా జరగాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మండలంలోని కుడితిపాళెం, ముదివర్తిపాళెం, నిడిముసలి గ్రామాల్లో గురువారం ఆయన పింఛన్లను అందించడంతో పాటు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అందజేసిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలహరి, డిప్యూటీ తహసీల్దార్ జగదీష్, ఆర్ఐ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

97 శాతం పంపిణీ

పొదలకూరు : మండల పరిధిలో తొలిరోజు 97 శాతం పింఛన్లను ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మహ్మద్‌రఫీ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేశారన్నారు. అన్నిరకాల పింఛన్లు కలిపి 10,083 కాగా తొలిరోజున 9,707 పింఛన్లను అందజేశామన్నారు.

పేదలకు ఆసరా పింఛన్‌లు

కొడవలూరు : పేదల జీవితాలకు ఆసరాగా సామాజిక పింఛన్‌లు ఉపకరిస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సామాజిక పింఛన్లను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల పింఛను అందజేయడంలో జాప్యం జరిగితే మరుసటి రోజు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్, ఏపీఎం ఎస్.రుక్మిణి, సీసీ శోభ, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, వీఓఏ మాలతి, నాయకులు తువ్వర ప్రవీణ్‌కుమార్, బండి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు తొలిటీకా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

పొదలకూరు : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తొలిటీకా వలె పనిచేస్తుందని వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కనుపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగించాల్సిందిగా సూచించారు. బిడ్డకు ఆరుమాసాల వరకు తల్లి పాలు పట్టిస్తే మంచిదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమల్లేశ్వరి, సుజాత, తిరుపతమ్మ, ఆశావర్కర్ యశోదమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మనుబోలు : గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ రమణమ్మ అన్నారు. మండలంలోని పిడూరు ఎస్టీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కనీసం సంవత్సరం పాటైనా బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు ముర్రుపాలను తప్పకుండా ఇవ్వాలన్నారు. వీటిలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉండి బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు కృష్ణవేణి, విజయమ్మ, మహాలక్ష్మి, ఆశా కార్యకర్త సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రీరామరక్ష

విడవలూరు : తల్లిపాలే బిడ్డలకు శ్రీరామరక్ష అని ఊటుకూరు సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు తెలియజేశారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం, అలగానిపాడు గ్రామాల్లో జాతీయ తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంటి బిడ్డకు తల్లిపాలు తాగించడం ద్వారా బిడ్డ ఎదుగుదలకు అవసరమయ్యే పోషకాలు అందుతాయని, ఆహారం సులభంగా జీర్ణమవుతుందని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ప్రసవం అయిన వెంటనే తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు చంటి బిడ్డలకు తప్పనిసరిగా తాగించాలని, అవి చాలా శ్రేయస్కరమని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్తేరమ్మ, విమలమ్మ, విజయమ్మ, ఏఎన్ఎం సుబ్బమ్మ, ఎమ్‌హెచ్‌పీ ఝాన్సీ, ఆశా వర్కర్లు నాగమణి, లలిత పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కొడవలూరు : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కొడవలూరు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ముర్రుపాలు విధిగా పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శేషుబాయి, ఉపాధ్యాయిని లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్టీ యాస్మిన్, ఎస్కే.రమీజా, వై.కామేశ్వరి, పి.శాంతి, కె.నాగరాజ, ఎస్కే.అఫ్రీన్ పాల్గొన్నారు.

కొత్తవంగల్లులో..

మండలంలోని కొత్తవంగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.వాసు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విడవలూరు : గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



కొడవలూరులో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల



కొడవలూరు: కొత్తవంగల్లులో హాజరైన గర్భిణులు, బాలింతలు



పొదలకూరు : మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి



మనుబోలు : తల్లిపాల విశిష్టతను తెలిపేలా ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు